

మేడారానికి 494 బస్సులు
మేడారం జాతరకు వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ ఖమ్మం రీజియన్ నుంచి 494 బస్సులను ఏర్పాటు చేసింది. 10లో



'గ్యాస్' దరఖాస్తులపై సర్వే
గ్యాస్ సబ్సిడీ కోసం వచ్చిన దరఖాస్తులపై అధికారులు ఇంటింటికీ తిరుగుతూ సర్వే చేపడుతున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
$34^{\circ} / 22^{\circ}$

వాతావరణం
జిల్లాలోశనివారం వాతావరణం చల్లగా ఉండే అవకాశం ఉంది. రాత్రి వేళ చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

స్వర్ణకవచధారణలో రామయ్య

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామివారి మూలమూర్తులు శుక్రవారం స్వర్ణకవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. కాగా, శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి)ఆలయంలో అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతిని సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేకపూజలు, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమ పూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈఓ ఎస్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం పాల్గొన్నారు.

15న జేఎల్‌ఎంల ఎంపిక పరీక్ష

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన జూనియర్ లైన్‌మెన్ (జేఎల్‌ఎం) అభ్యర్థుల ఎంపిక పరీక్ష ఈనెల 15న నిర్వహించనునుట్లు ఖమ్మం ఎస్‌ఈ ఏ.సురేందర్ తెలిపారు. 2019లో విడుదల చేసిన నోటిఫికేషన్ ఆధారంగా జూనియర్ లైన్‌మెన్ల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాలకు సంబంధించి మూడో దశలో ఇటీవల 23 పోస్టులకు పరీక్ష నిర్వహించగా 20 మంది హాజరయ్యారు. వీరిలో 10 మంది స్తంభం ఎక్కే పరీక్షలో ఉత్తీర్ణత సాధించగా, మరో 13 పోస్టులకు వెయింటింగ్‌లో ఉన్న అభ్యర్థులకు అవకాశం ఇచ్చారు. ఆయా అభ్యర్థులు ఈనెల 15న ఖమ్మం విద్యుత్ శాఖ కార్యాలయంలో నిర్వహించే పరీక్షకు హాజరు కావాలని సమాచారం ఇచ్చారు.

ఉత్సాహంగా డీఏఈ సాంస్కృతిక పోటీలు

అశ్వాపురం: మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలో భారత అణుశక్తి విభాగం(డీఏఈ) 38వ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్‌లో భాగంగా నాలుగు రోజులుగా జరుగుతున్న సాంస్కృతిక పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. దేశవ్యాప్తంగా వివిధ యూనిట్ల నుంచి ఎనిమిది బృందాలుగా కళాకారులు పోటీల్లో పాల్గొని తమ కళలను ప్రదర్శిస్తున్నారు. శుక్రవారం వాయిద్యం–హిందుస్థానీ, పాశ్చాత్య, పెర్కషన్, కర్ణాటిక్ వాయిద్యాలతో కళాకారులు అలరించారు. సుమారు 200 మంది కళాకారులు హాజరయ్యారు. నేటితో పోటీలు ముగియనున్నాయి. ముగింపు వేడుకలకు కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి, అణుశక్తి కమిషన్ సభ్యులు సీమా శర్మజైన్, భారజల బోర్డు చైర్మన్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సత్యకుమార్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని భారజల కర్మాగారం జీఎం జగ్గారావు, డీజీఎం, స్పోర్ట్స్ మీట్ కన్వీనర్ హెచ్‌కే.శర్మ తెలిపారు.

నేషనల్ సైన్స్‌ఫేర్‌కు రెండు ప్రాజెక్టులు..



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ఎగ్జిబిట్ వద్ద విద్యార్థినులు

కొత్తగూడెం అర్బన్: జాతీయ స్థాయి సైన్స్ ఫేర్‌కు జిల్లా నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపికయ్యాయని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి తెలిపారు. ఇటీవల జరిగిన సౌత్ ఇండియా, రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌పోటీల ఫలితాల వివరాలను శుక్రవారం ఆయన వెల్లడించారు. సీనియర్స్ విభాగంలో ఇల్లెందు సింగరేణి పాఠశాల విద్యార్థి టి.వరుణ్‌కోమల్ రూపొందించిన అగ్రీ రోబో అనే ఎగ్జిబిట్, కొత్తగూడెంలోని త్రివేణి పాఠశాల విద్యార్థిని బి.దీప్షిక రూపొందించిన లిక్విడ్ ట్రీ అండ్ బయోఎంజైమ్ అనే ఎగ్జిబిట్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాయని తెలిపారు. విద్యార్థులను జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.చలపతిరాజు అభినందించారు.

'ఇసుక'పై ఆసక్తి

ఇసుక విక్రయాలకు కొత్త పాలసీ తేనున్న ప్రభుత్వం

- పాత విధానంలో లోపాలపై దృష్టి సారిస్తే మేలు
- పర్మిట్లు, అదనపు బకెట్లే ప్రధాన సమస్య
- ఏజెన్సీలో బినామీలు లేకుండా చేస్తే గిరిజనులకు ఉపయోగం

ఇసుక క్రయవిక్రయాలపై సరికొత్త పాలసీ రూపొందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. జిల్లాలో గోదావరి తీరం వెంబడి పినపాక, మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు, చర్ల, దుమ్ముగూడెంలలో భారీ ఇసుక ర్యాంపులు ఉన్నాయి. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం



ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ముందు..

ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ముందు నదులు, వాగుల్లో ఇసుక మేటలను మైనింగ్ శాఖ గుర్తించేది. ఆయా ప్రాంతంలో ఉన్న ఇసుకకు వెల కట్టి అమ్మకాల కోసం వేలం నిర్వహించేది. వేలంలో ర్యాంపులు దక్కించుకున్న వారు ఇసుకను నేరుగా అమ్ముకునేవారు. వేలంలో పాడిన ఇసుకకు, అమ్మకాల మధ్య భారీగా తేడా ఉండటంతో గత సర్కారు నూతన విధానం అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం గోదావరి తీర ప్రాంతంలో ఇసుక ర్యాంపులను తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్ఎండీసీ) నిర్వహణలోకి వెళ్లాయి. ఇసుక అవసరం ఉన్న వారు టీఎస్ఎండీసీ వెబ్‌సైట్ ద్వారా కావాల్సిన ఇసుకను, కోరుకున్న ర్యాంపు నుంచి కొనుగోలు చేసే విధంగా మార్చారు. వెబ్‌సైట్ ద్వారానే నగదు చెల్లించి ఇసుక, వాహనాల పర్మిట్లను పొందేవారు. ఇలా పర్మిట్లు ఉన్న వారికి టీఎస్ఎండీసీ నిర్దేశించిన ర్యాంపుల దగ్గరి నుంచి ఇసుకను అందుబాటులో ఉంచేవారు.

ఒకే పర్మిట్‌పై అనేక లోడ్‌లు

టీఎస్ఎండీసీ తరఫున ఇసుక ర్యాంపులు నిర్వహించే ఏజెన్సీలు అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారడంతో సమస్య మొదటికి వచ్చింది. ప్రతీ ర్యాంపులో పర్మిట్ ఉన్న లారీలకు అదనపు బకెట్లలో లెక్కల్లోకి రాని ఇసుకను పోయడం పరిపాటిగా మారింది. అయితే రానురాను ఇంతకు మించిన స్థాయిలో దోపిడీ పురుడుపోసుకుంది. ఒకే పర్మిట్‌పై అనేక లారీల్లో ఇసుకను తరలించడం మొదలైంది. పారదర్శకత పేరుతో ర్యాంపుల దగ్గర ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు అలంకారప్రాయంగా మారాయి. దీనికి తోడు ర్యాంపు మొదలు ఇసుక చేరే చివరి గమ్యం వరకు రాజకీయ నేతల ఒత్తిళ్లు పెరిగాయి. ఫలితంగా ప్రభుత్వ లెక్కల్లోకి రాకుండా భారీ స్థాయిలో ఇసుక నదుల నుంచి తరలిపోయింది. దీంతో కొత్త విధానం అవసరమనే నిర్ణయానికి రాష్ట్ర ప్రభుత్వం వచ్చింది.

గిరిజన సొసైటీలను బలోపేతం చేయాలి

గోదావరి తీరంలో పీసా చట్టం అమలు చేయడం కష్టతరంగా మారింది. నదిలో భారీ యంత్రాలు ఉపయోగించకుండా ఇసుకను తోడటం లాభసాటి కాదనే వాదనలు ఉన్నాయి. ఇదే సమయంలో గిరిజన సంఘాలు భారీ యంత్రాలను కొనుగోలు చేసే స్థాయిలో ఆర్థిక స్వావలంబన సాధించలేదు. ఫలితంగా ఇసుక ర్యాంపుల్లో బినామీల పెత్తనం అనధికారికంగా నడుస్తోంది. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలు, ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఏజెన్సీ ఏరియాలో ర్యాంపులు నిర్వహించే గిరిజన సొసైటీలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. రుణాలపై ఇసుక తోడివేతలో ఉపయోగించే భారీ యంత్రాలను గిరిజన సొసైటీలకు అందించే అంశాన్ని పరిశీలించాలనే డిమాండ్లు వస్తున్నాయి.

మనకు ప్రత్యేకం

కొత్త పాలసీలో జిల్లాకు సంబంధించిన ప్రత్యేక పరిస్థితులను ప్రభుత్వం గమనంలోకి తీసుకోవాలనే డిమాండ్లు వస్తున్నాయి. జిల్లా ఏజెన్సీ పరిధిలో ఉండగా, ఇక్కడ అధికంగా నివసించే గిరిజనుల హక్కులను రక్షించేందుకు ప్రత్యేక చట్టాలు అమల్లో ఉన్నాయి. అందులో పీసా చట్టం ఒకటి. ఈ చట్టం ప్రకారం ఏజెన్సీ ఏరియాలో ఇసుక తవ్వకాలు చేపట్టినప్పుడు స్థానికంగా ఉండే గిరిజనులకు లబ్ధి జరగాల్సిందే. అందుకనే ఇక్కడ భారీ మిషన్లతో ఇసుకను తోడటం నిషేధం. కేవలం గిరిజన సొసైటీ ద్వారా ఇసుక మైనింగ్‌ను పర్యవేక్షిస్తూ స్థానికంగా ఉన్న కార్మికులతోనే మాన్యువల్‌గా గోదావరిలో ఇసుకను తోడాలి. ఇలా తోడిన ఇసుకను నది తీరానికి బయట ఉండే ప్రాంతంలో రీచ్ లేదా స్టాక్ పాయింట్‌కు చేరవేయాలి. స్టాక్ పాయింట్‌లో ఉన్న ఇసుకను టీఎస్ఎండీసీ వెబ్‌సైట్ ద్వారా ఇసుకను బుక్ చేసుకున్నవారికి లోడ్ చేయాలి. అంటే నదీలో మనుషులు తప్ప యంత్రాలతో పని చేయడానికి అవకాశం లేదు.

ఉపాధ్యాయులకు సెలవులు ఇవ్వకండి

- పదో తరగతి పరీక్షలు పూర్తయ్యేవరకు చర్యలు
- కలెక్టర్ ప్రియాంక ఆల



చంద్రుగొండ జెడ్పీ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

చంద్రుగొండ : పదో తరగతి పరీక్షలు పూర్తయ్యేవరకు ఉపాధ్యాయులకు సెలవులు ఇవ్వొద్దని కలెక్టర్ ప్రియాంక ఆల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. మండలకేంద్రం చంద్రుగొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆమె సందర్శించారు. హాజరు రికార్డులను పరిశీలించారు. ముగ్గురు ఉపాధ్యాయులు సెలవులపై ఉండటంతో హెచ్‌ఎంను ప్రశ్నించారు. ఇకపై పదో తరగతి పరీక్షలు పూర్తయ్యేవరకు సెలవులు ఇవ్వొద్దని సూచించా రు. మూత్రశాలలు లేవని, చంద్రుగొండ–జూలూరుపాడు రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మాణానికి నిధులు మంజూరైన పనులు చేపట్టలేదని జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి, ఎంపీపీ బాణోత్ పార్వతి, ఎంపీటీసీ దార వెంకటేశ్వరరావు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బదులిచ్చారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలకు సిద్ధం కావాలని, ఉన్న నెలరోజుల సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శ్రద్ధగా చదువుకుని ఫస్ట్‌గ్రేడ్‌లో ఉత్తీర్ణత సాధించాలని చెప్పారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచండి

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ ప్రియాంక సూచించారు. ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్యం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆమె తిప్పనపల్లి పంచాయతీని సందర్శించారు. వైకుంఠధామం, డంపింగ్‌యార్డ్‌లను పరిశీలించి చెత్తాచెదారం చూసి కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, ఇందులో అందరూ భాగస్వాములు కావాలన్నారు. అనంతరం వైకుంఠధామంలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమాల్లో డీపీఓ లక్కినేని లక్ష్మీరమాకాంత్, మండల స్పెషల్ ఆఫీసర్ సంజీవరావు, తహసీల్దార్ సాదియాసుల్తానా, ఎంపీడీఓ జి.రేవతి, ఎంపీఓ తోట తులసీరాం, వివిధ శాఖాధికారులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

790 యూనిట్ల ప్రాథమిక పరిశీలన పూర్తి



అదనపు కలెక్టర్ నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయంలో జరుగుతున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వీవీప్యాట్లు మొదటిస్థాయి పరిశీలనను కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల శుక్రవారం సందర్శించి పరిశీలించారు. జిల్లాకు 1,600 కంట్రోల్ యూనిట్లు, 2,800 వీవీ ప్యాట్లు, 1,500 బ్యాలెట్ యూనిట్లు వచ్చాయని తెలిపారు. ఇప్పటివరకు 790 యూనిట్లు ప్రాథమిక పరిశీలన పూర్తయిందని, 14వ తేదీ వరకు అన్ని యూనిట్ల పరిశీలన పూర్తవుతుందని వివరించారు. అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీఓ శిరీష, కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య, ఎన్నికల విభాగం తహసీల్దార్ దారా ప్రసాద్, నాయబ్ తహసీల్దార్ రంగాప్రసాద్, సిబ్బంది నవీన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలు అందించాలి

ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్



అధికారులతో సమీక్షిస్తున్న పీఓ ప్రతీక్ జైన్

భద్రాచలంఅర్బన్: గిరిజన నిరుద్యోగులకు సబ్సిడీ రుణాలు అందేలా ఎంపీడీఓలు, బ్యాంకర్లు చొరవ చూపాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్‌జైన్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయం నుంచి శుక్రవారం జిల్లాలోని ఎంపీడీఓలు, బ్యాంకర్లతో ట్రైకార్ యూనిట్ల గ్రౌండింగ్‌పై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ట్రైకార్ యూనిట్ల గ్రౌండింగ్‌లో నిర్లక్ష్యం చేయొద్దన్నారు.

ఉద్యానవన నర్సరీకి వేలం

భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని చుంచుపల్లి మండలం ప్రశాంత్‌నగర్ గ్రామపంచాయతీ పరిధి గరిమెళ్లపాడు హెచ్‌ఎంటీసీ నర్సరీలో చెట్ల ఫలసాయాన్ని పొందేందుకు నాలుగేళ్లపాటు అప్పగించేందుకు వేలం నిర్వహించినట్లు పీఓ తెలిపారు. ఆరుగురు పాల్గొనగా పాల్వంచ మండలానికి చెందిన ఎస్.శ్రీనివాసరావు రూ.6.01 లక్షలకు కోట్ చేయగా అప్పగించినట్లు పేర్కొన్నారు. అధికారులు మరియన్న, డేవిడ్ రాజ్, శ్రీనివాస్, రాజేష్, రామ్ కుమార్, అశోక్‌కుమార్, మంగమ్మ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంసీహెచ్‌లో గర్భిణుల అవస్థ

- విద్యుత్ లేకపోతే నిలిచిపోతున్న వైద్యసేవలు
- ఆస్పత్రిలో సక్రమంగా పనిచేయని జనరేటర్
- స్కానింగ్ కోసం గంటల తరబడి పడిగాపులు



జిల్లా కేంద్రంలోని ఎంసీహెచ్

కొత్తగూడెంరూరల్: జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రం(ఎంసీహెచ్)లో గర్భిణులకు కష్టాలు తప్పడంలేదు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వైద్య సేవలు నిలిచిపోతున్నాయి. దీంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన గర్భిణులు వేచి చూడాల్సి వస్తోంది. కొత్తగూడెం రామవరంలో ఉన్న ఎంసీహెచ్‌కు జిల్లా వ్యాప్తంగా గర్భిణులు వైద్య సేవలకు వస్తుంటారు. దూర ప్రాంతాలైన చర్ల, దమ్మపేట, సత్తుపల్లి, అశ్వారావుపేట, మణుగూరు, పినపాక, ఆళ్లపల్లితోపాటు ములుగు జిల్లా వెంకటాపురం, ఏపీలోని వేలేరుపాడు వంటి ప్రాంతాల నుంచి కూడా పలువురి వచ్చి వైద్యం పొందుతుంటారు. అయితే ఆస్పత్రిలో ఉన్న జనరేటర్ సక్రమంగా పనిచేయడంలేదు. కరెంటు లేకపోతే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. స్కానింగ్ రిపోర్టు ఆధారంగా వైద్య సేవలందించాల్సి ఉండగా, గర్భిణులు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. కనీసం స్కానింగ్ గది వరకైనా ఇన్వర్టర్ సౌకర్యం కల్పించాలని పలువురు కోరుతున్నారు. ఈ నెల 3న విద్యుత్ సరఫరాలో అంతరాయం జరగ్గా, సుమారు 50 మంది గర్భిణులు స్కానింగ్ కోసం ఎదురు చూసి ఇంటికి తిరిగి వెళ్లారు. కొందరు గర్భిణులను వైద్యుల వద్దకు పంపకుండా మిడ్‌వైఫరీ సిబ్బందే వైద్య సేవలందరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. వారు సమస్యలను పూర్తిస్థాయిలో గుర్తించకపోవడంతో గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. ఎంసీహెచ్‌లో అధికారుల పర్యవేక్షణలోపం కారణంగా సిబ్బంది ఇష్టానుసారంగా విధులు నిర్వర్తిస్తున్నారనే ఆరోపణలు కూడా వ్యక్తమవుతున్నాయి.

నడక యాతన..

విజయవాడ జాతీయ రహదారిపై ఎంసీహెచ్ సమీపంలో బస్టాప్ లేకపోవడంతో ఆర్టీసీ బస్సులు ఆపడం లేదు. దీనికితోడు రోడ్డు నుంచి ఆస్పత్రి అరకిలోమీటరు దూరంలో ఉంటుంది. దీంతో గర్భిణులు బస్టాప్ నుంచి ఆస్పత్రికి వెళ్లి రావాలంటే నడవలేక అవస్థ పడుతున్నారు. ఆటోలకు అధిక చార్జీలు చెల్లించాల్సి వస్తోంది. జాతీయ రహదారి నుంచి ఎంసీహెచ్‌కు గర్భిణులను తీసుకెళ్లేలా బ్యాటరీ వాహనాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఎంసీహెచ్ సమస్యలు పరిష్కరించాలని గర్భిణులు వేడుకుంటున్నారు.

ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్ రాజేష్

పాల్వంచరూరల్: ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాల కోసం విద్యార్థులు ఈ నెల 11వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన క్రీడల అధి కారి టి.సీతారాం సూచించారు. మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లిలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉపాధి అవకాశాలపై అధికారులు కె.రాజేష్, దేవకాంత మిశ్రా అవగాహన కల్పించారు. అర్హత కలిగిన విద్యార్థులు అగ్నిపథ్, వాయు విభాగంలో చేరేందేకు https//agnipathvayu.cdac>in/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్ నోడల్ అధికారి సులోచనారాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.చిన్నప్పయ్య, ఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హవిళ, సూపరింటెండెంట్ ఆర్.ఉదయ్‌కుమార్, తిరుమలరావు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

కొత్తగూడెంటౌన్: అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను శుక్రవారం ఇన్‌చార్జ్ జిల్లా క్రీడలశాఖ అధికారి(డీవైఎస్‌ఓ) టి.సీతారాం అభినందించారు. హనుమకొండలో ఈ నెల 7,8వ తేదీల్లో జరిగిన పోటీల్లో గీతాహర్షిణి జాతీయస్థాయిలో, ఇ.వెన్నల ఎస్.మహేశ్వరి, ఎస్.అజయ్‌తేజా, కే.రేణుక, టి.చంద్రకళ బంగారు, వెండి పతకాలు సాధించారు. వీరిని అభినందించిన డీవైఎస్‌ఓ పోటీల్లో మరింత రాణించాలని సూచించారు. జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.కాశీహుస్సేన్, జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.నిహారిక, టి.వెంకటేశ్వర్లు, రవి, శ్వేత పాల్గొన్నారు.

ములకలపల్లిలో..

ములకలపల్లి: వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన 'గురుకుల'విద్యార్థినులకు ఖమ్మం రీజియన్ ఆర్‌సీఓ కే. ప్రత్యూష అభినందించారు. మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాలను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ప్రతిభ చాటిన పి.మనస్విని, జీ. మైత్రీ, టి. దివ్యశ్రీ,, పి. లోహితలను అభినందించి, మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలంటే భయపడవద్దని, ఇష్టపడి చదవాలని సూచించారు. ప్రిన్సిపాల్ సునీత, సుజాత పాల్గొన్నారు.

గృహజ్యోతి అమలుకు సన్నాహాలు

- ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తున్న విద్యుత్ సిబ్బంది
- జిల్లాలో 200 యూనిట్ల లోపు వినియోగించే కనెక్షన్లు 2,51,093



వివరాలు సేకరిస్తున్న విద్యుత్ ఏఈ ధర్మరాజు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పథకంలో భాగంగా జిల్లాలో గృహజ్యోతి పథకం అమలుకు విద్యుత్ శాఖ సిద్ధమవుతోంది. ఇంటింటికీ తిరిగి వినియోగదారుల వివరాలను విద్యుత్ సిబ్బంది సేకరిస్తున్నారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఫోన్ నంబరు సేకరిస్తున్నారు. సొంత ఇల్లు లేకుండా కిరాయి ఇంట్లో నివసించే విద్యుత్ వినియోగదారులు కూడా విధిగా వారి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, మొబైల్ నంబరును ఇంటి సర్వీస్ నంబరుకు లింక్ చేయాల్సి ఉంటుంది. ఈవిషయంలో ఓనర్‌షిప్ మాత్రం మారదని విద్యుత్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఒకవేళ ఇంటివద్ద వినియోగదారులు లేనిపక్షంలో ఒక పేపర్ మీద ఆధార్‌కార్డు నంబరు, రేషన్‌కార్డు నంబరు, మొబైల్ నంబరు రాసి మీటర్ వద్ద ఉంచాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో మొత్తం 2,82,435 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో ప్రభుత్వం ప్రకటించిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు లబ్ధిపొందేవి 2,51,093 కనెక్షన్లు ఉన్నాయి. 200 యూనిట్ల కంటే ఎక్కువ యూనిట్లు వినియోగించుకునే వినియోగదారుల కనెక్షన్లు 31,342 ఉన్నాయి.

వివరాలు ఇవ్వాలి



ప్రభుత్వ ఆదేశాల మేరకు గృహజ్యోతి పథకం అమలుకు ఉపక్రమించాం. వినియోగదారుల ఇళ్లకు మీటర్ రీడింగ్ తీయడానికి వచ్చిన వారికి గానీ లేదా ప్రత్యేకంగా వచ్చే విద్యుత్ అధికారులు, సిబ్బందికి వివరాలు చూపించాలని ఇప్పటికే విస్తృత ప్రచారం చేశాం. –రమేష్, విద్యుత్ ఎస్ఈ

బెల్లం విక్రయాలపై ఆంక్షలు

- ఆధార్ నంబర్, చిరునామా చెబితేనే అమ్మకం
- సమ్మక్కకు 'ఎత్తు బంగారం' సమర్పించేందుకు భక్తుల ఇక్కట్లు
- గుడుంబా తయారీకి తరలించకుండా ఎక్సైజ్ శాఖ పర్యవేక్షణ



సమ్మక్కకు సమర్పించేందుకు చిన్నారి ఎత్తు బంగారం(బెల్లం) తూకం వేస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: ములుగు జిల్లా మేడారంలో రెండేళ్లకోసారి ఘనంగా జరిగే సమ్మక్క – సారలమ్మ జాతర సమీపిస్తోంది. ఈ జాతరలో భక్తులు ఎత్తు బంగారం(బెల్లం) సమర్పించి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. కొన్నాళ్ల ముందుగానే బంగారం కొనుగోలు చేసి ఇంట్లో పూజలు చేశాక మేడారం వెళ్లి సమర్పిస్తారు. అయితే, బెల్లంను నాటుసారా తయారీకి వినియోగించే అవకాశం ఉండడంతో భక్తులు కాకుండా ఇతరులకు అమ్మకుండా ఎక్సైజ్ శాఖ అధికారులు ఆంక్షలు విధించారు. ఆధార్ నంబర్, పూర్తి చిరునామా నమోదు చేసుకున్నాకే బెల్లం విక్రయించాలని సూచిస్తుండడంతో అటు భక్తులు, ఇటు వ్యాపారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

గుడుంబా తయారీకి వినియోగం

గ్రామాల్లో కొన్నేళ్ల క్రితం వరకు విచ్చలవిడిగా గుడుంబా తయారీ, అమ్మకాలు సాగేవి. గుడుంబా తయారీలో ఎక్కువగా నల్లబెల్లం వినియోగించే వారు. కానీ ఎక్సైజ్ అధికారులు తీసుకున్న చర్యలతో నల్లబెల్లం అమ్మకాలు పూర్తిగా నిలిచిపోగా.. గుడుంబా తయారీ సైతం ఆగిపోయింది. ఇంతలోనే తెల్లబెల్లాన్ని సైతం కొందరు గుడుంబా తయారీకి వినియోగిస్తున్నారని.. జాతర పేరిట భారీగా బెల్లం కొనుగోలు చేసి నిల్వ చేయనున్నారనే సమాచారం అధికారులకు అందింది. దీంతో భక్తులకు కాకుండా గుడుంబా తయారీదారులకు బెల్లం విక్రయించొద్దని వ్యాపారులను ఆదేశించారు. ఈ మేరకు కొనుగోలుదారుల పూర్తి చిరునామా, ఆధార్ నంబర్ సేకరించాకే విక్రయిస్తుండడంతో.. అసలైన భక్తులు ఇవేవీ తీసుకోకుండా షాపులకు వెళ్లే సమయంలో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

నాటుసారా తయారీకి వినియోగిస్తే చర్యలు



మేడారం జాతర పేరుతో కొందరు బెల్లం కొనుగోలు చేసి నాటుసారా తయారీకి వినియోగించే అవకాశం ఉండడంతో ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశాం. వ్యాపారులు సైతం పూర్తి వివరాలు సేకరించాకే బెల్లాన్ని విక్రయించాలి. ఎవరైనా బెల్లాన్ని నాటుసారా తయారీకి ఉపయోగించినట్లు తేలితే తయారీదారులతో పాటు వ్యాపారులపైనా చర్యలు తీసుకుంటాం.
– ఎస్. జానయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్

వందల టన్నులు దిగుమతి

మేడారం జాతరకు వెళ్లే భక్తులు బెల్లం(బంగారం) భారీగా కొనుగోలు చేస్తారనే అంచనాతో వ్యాపారులు రెండు నెలల ముందు నుంచే భారీగా సరుకు దిగుమతి చేసుకున్నారు. రెండేళ్ల క్రితం జరిగిన జాతర సందర్భంగా జిల్లాలో సుమారు రూ.10కోట్ల మేర బెల్లం విక్రయాలు జరిగినట్లు అంచనా. ఈసారి కూడా అలాగే ఉంటుందనే భావనతో వ్యాపారులు భారీగా దిగుమతి చేసుకున్నారు. ఈ క్రమంలో బంగారం కోసం భక్తులు వస్తుండగా ఆధార్ కార్డు నంబర్, చిరునామా నమోదు చేశాకే విక్రయిస్తున్నారు. కాగా, గతేడాది కేజీ బెల్లం రూ.40 ఉంటే ఈసారి రూ.55నుంచి రూ.60 చొప్పున విక్రయిస్తుండటంతో భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

పినపాక మండలంలో డీఈఓ పర్యటన



ఉపాధ్యాయుడితో మాట్లాడుతున్న డీఈఓ

పినపాక: మండలంలో జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరచారి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా జానంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం మాట్లాడుతూ.. రానున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పేర్కొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



మొక్కలను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు

దుమ్ముగూడెం: పంచాయతీల్లోని నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను సంరక్షించాలని డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు తెలిపారు. శుక్రవారం మండలంలోని కొత్తదంతెనం, చిన్ననల్లబల్లి గ్రామాల్లోని నర్సరీలను ఆయన సందర్శించి మొక్కలను పరిశీలించాక మాట్లాడారు. కలుపు మొక్కలను తొలగించి, మొలకెత్తని విత్తనాల స్థానంలో కొత్త విత్తనాలు పెట్టాలని చెప్పారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నీరు పోయాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ ముత్యాలరావు, ఏపీఓ సుకన్య, పంచాయతీ కార్యదర్శులు శోభారాణి, మాధవి, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల ఆందోళన



వినతిపత్రం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఆశ వర్కర్ల పెండింగ్ పారితోషకాలను తక్షణమే చెల్లించాలని కోరుతూ తెలంగాణ ఆశ వర్కర్ల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంవీ అప్పారావు మాట్లాడుతూ పారితోషకాలు కూడా సకాలంలో రాకపోవడంతో ఆశ వర్కర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే మళ్లీ సమ్మెలోకి వెళ్లాల్సిన పరిస్థితులు వస్తాయని పేర్కొన్నారు. అనంతరం సంబంధిత అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దొడ్డ రవికుమార్, గద్దల శ్రీను, కె.సత్య, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రఘూన్నీ, కార్యదర్శి ధనలక్ష్మి, నాయకులు జయ, రుక్మిణి, హేమ, సుశీల, భాగ్య, రమణ, పుష్ప, ఎస్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

లారీడ్రైవర్ అదృశ్యం

పాల్వంచరూరల్: నెల రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటనపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన, లారీడ్రైవర్‌గా పనిచేస్తున్న జాటోత్ ఆము గత నెల 2వ తేదీన ఇంటి నుంచి బయటకువెళ్లి తిరిగిరాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదని ఆము కుమారుడు రమేశ్ శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

పశువులను తరలిస్తున్న వ్యాన్ పట్టివేత

పాల్వంచరూరల్: అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని కేశవాపురం వద్ద బీసీయం జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తుండగా శుక్రవారం రాత్రి చర్ల నుంచి కోదాడ వైపు వ్యాన్‌లో తరలిస్తున్న తొమ్మిది పశువులను, వాటిని తరలిస్తున్న డ్రైవర్ రామిశెట్టి రవికుమార్‌ను పట్టుకున్నామని ఎస్‌ఐ బి.శ్రీనివాస్ తెలిపారు.

ఐదుగురిపై కేసు నమోదు

సుజాతనగర్: పొలంగట్టు వివాదంలో దాడి ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ ఎం.సోమేశ్వర్ తెలిపిన వివరాలు.. గరీబ్‌పేట గ్రామానికి చెందిన బొమ్మెరబోయిన సైదులు, చిత్తారి రాములు వ్యవసాయ భూములు సుజాతనగర్ రెవెన్యూ పరిధిలో ఉన్నాయి. పొలంగట్టు విషయంలో కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో గురువారం సైదులు తనపై దాడి చేశాడంటూ రాములు తన కుటుంబీకులకు తెలియజేశాడు. ఈ క్రమంలో శుక్రవారం పొలంలో ఉన్న సైదులుపై చిత్తారి కృష్ణ, మల్లేష్, నరేందర్, లింగస్వామి, లింగప్రసాద్‌లు దాడికి పాల్పడ్డారు. సైదులు సోదరుడు ఉపేందర్ ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

'గ్యాస్' దరఖాస్తులపై సర్వే

- తప్పిదాల సవరణలకు ప్రత్యేక బృందాలు
- గ్యాస్ పథకానికి వచ్చిన అర్జీలు 2,66,934
- తప్పిదాలు దొర్లినట్లు గుర్తించినవి 72,500



కొత్తగూడెం అర్బన్: దరఖాస్తులను పరిశీలన చేసి మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక అల

చుంచుపల్లి: ప్రజాపాలనలో భాగంగా స్వీకరించిన దరఖాస్తుల్లో భారీగా తప్పిదాలు దొర్లినట్లు అధికారులు గుర్తించారు. ముఖ్యంగా తక్షణమే అమలు చేయబోతున్న సబ్సిడీ గ్యాస్ సిలిండర్ కోసం వచ్చిన దరఖాస్తుల్లో ఎక్కువ తప్పిదాలు రావడంతో వాటిని సరిచేసే కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుట్టారు. గ్రామాలు, మున్సిపాలిటీల పరిధిలో వచ్చిన దరఖాస్తుదారుల వివరాలన్నీ ఇప్పటికే ప్రత్యేక వెబ్‌సైట్‌లో క్రోడీకరించారు. ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ పథకానికి ఒక ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. శుక్రవారం నుంచి అధికారుల బృందాలు ఇంటింటికీ వెళ్లి తప్పిదాలు దొర్లిన దరఖాస్తుదారుల వివరాలను సేకరించే పనిలో పడ్డారు. పూర్తి వివరాలను శనివారం సాయంత్రంలోపు సేకరించాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో ఆ పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

ఇంటింటికీ వెళ్లి..

ప్రత్యేక బృందాలు ఇంటింటికీ వెళ్లి మొబైల్ ఫోన్లో యాప్‌ని ఇన్‌స్టాల్ చేసి దరఖాస్తుదారుడి చిరునామాకు వెళ్లి వివరాలు తీసుకుంటున్నారు. గ్యాస్ కనెక్షన్ కాగితాలను చూసి ధ్రువీకరించుకొని గ్యాస్ సిలిండర్ వినియోగదారుడి పేరు, నంబరు, గ్యాస్ ఏజెన్సీపేరు, అడ్రస్, ఫోన్ నంబర్ వంటి వివరాలను తిరిగి పొందుపర్చుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమల్లో భాగంగా డిసెంబర్ 28 నుంచి పది రోజుల పాటు ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజలకు సరైన అవగాహన లేకపోవడం వల్ల ఆ సమయంలో సమగ్ర సమాచారం పొందుపరచలేకపోయారు. ప్రభుత్వం త్వరలో మరో రెండు పథకాలైన సబ్సిడీ గ్యాస్ సిలిండర్ పథకంతో పాటు గృహలక్ష్మి పథకాలకు శ్రీకారం చుట్టబోతున్న తరుణంలో తప్పులు దొర్లిన దరఖాస్తులు సవరించేందుకు అధికారులు అత్యవసరంగా దృష్టి సారించారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన రూ.500కే గ్యాస్ సిలిండర్ హామీని ఇటీవల అమలు చేస్తామని స్పష్టం చేసింది. ఈ తరుణంలోనే ఇటీవల ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులను మరోసారి పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా సబ్సిడీ గ్యాస్ పథకంలో భాగంగా అందజేసిన దరఖాస్తుల్లో గ్యాస్ కంపెనీ పేరు, కన్జూమర్ నంబర్, అడ్రస్ వివరాల వంటివి దరఖాస్తుదారులు నింపకపోవడంతో వాటిని సక్రమంగా అప్‌లోడ్ చేయలేకపోయారు. ఇలాంటి వాటిని గుర్తించిన అధికారులు వాటి విషయంలో మరోసారి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని నిర్ణయించారు. సబ్సిడీ గ్యాస్ పథకంలో అందిన దరఖాస్తుల్లో 72,500 అసంపూర్తిగా ఉండటంతో వాటి విషయంలో ప్రత్యేక బృందాల ద్వారా గ్రామాల్లో అధికారులు విచారణ చేపడుతున్నారు. గ్రామ పంచాయతీకి నాలుగు బృందాలు, మున్సిపాలిటీ వార్డుకు ఇద్దరిని చొప్పున అధికారులు నియమించి ఇంటింటి సర్వే చేపడుతున్నారు.

విచారణ పకడ్బందీగా జరగాలి

కొత్తగూడెంఅర్బన్/సింగరేణి(కొత్తగూడెం): మహాలక్ష్మి పథకం దరఖాస్తుల విచారణ ప్రక్రియ పకడ్బందీగా జరగాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల ఆదేశించారు. శుక్రవారం కొత్తగూడెం మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో దరఖాస్తుల విచారణ ప్రక్రియను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం కింద రూ.500కే గ్యాస్ సిలిండర్ అందించనున్న నేపథ్యంలో ప్రజాపాలన దరఖాస్తుల విచారణ జరుగుతున్నట్లు చెప్పారు. ఈ నెల 10 వరకు విచారణ పూర్తి చేయాలని, విచారణకు వచ్చే బృందాలకు గ్యాస్ ఏజెన్సీ, వినియోగదారుని నంబర్, రేషన్ కార్డు నంబర్ వంటి వివరాలను తెలపాలన్నారు. దరఖాస్తుల్లో దొర్లిన తప్పులను ప్రత్యేక యాప్ ద్వారా సరిచేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మున్సిపల్ ప్రత్యేకాధికారి అర్జున్, మున్సిపల్ కమిషనర్ రఘు, కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య, ఈడీఎం విజయసారథి, కౌన్సిలర్ జమలయ్య, నాయకులు పాటి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిదాల సవరణకు విచారణ



రాష్ట్ర ప్రభుత్వం త్వరలో సబ్సిడీ గ్యాస్ పథకానికి శ్రీకారం చుట్టబోతోంది. దానిలో భాగంగా ఇటీవల స్వీకరించిన దరఖాస్తుల్లో కొందరు గ్యాస్ కంపెనీల పూర్తి వివరాలు పొందుపరచలేదు. అసంపూర్తిగా నింపిన, తప్పులు దొర్లిన దరఖాస్తులను గుర్తించాం. వాటిని సవరించేందుకు గ్రామాల్లో ఇంటింటికీ సర్వే చేయిస్తున్నాం.

– జి.మధుసూదన్‌రాజు, అదనపు కలెక్టర్

ఇంటింటికీ వెళ్లి సర్వే చేయండి



దరఖాస్తుల వివరాలను పరిశీలిస్తున్న డీసీఎస్‌ఓ

అశ్వారావుపేటరూరల్: ప్రజాపాలన సభల్లో భాగంగా గ్రామాల్లో స్వీకరించిన దరఖాస్తుల్లో సక్రమంగా లేని వారి ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టాలని డీసీఎస్‌ఓ రుక్మిణి ఆదేశించారు. శుక్రవారం ఆమె స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామసభల్లో మొత్తం 18,707 దరఖాస్తులు రాగా, వాటిలో 3,624 మందికి సంబంధించిన దరఖాస్తుల్లో రేషన్, గ్యాస్‌కు సంబంధించిన వివరాలు సరిగా లేవని, వాటికి సంబంధించిన వివరాలను ఆయా లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓ హరికృష్ణ, సిబ్బంది ఉన్నారు.

గంజాయి పట్టివేత



నిందితులు, గంజాయి ప్యాకెట్లను చూపుతున్న పోలీసులు

కొత్తగూడెంటౌన్: కారులో తరలిస్తున్న రూ.25 లక్షల గంజాయిని కొత్తగూడెం పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు బస్టాండ్ సెంటర్‌లో ఎస్‌ఐ విజయ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. కర్ణాటకకు చెందిన పవన్‌చౌహాన్, నెహ్రూరాథోడ్, నారాయణ్ ఖేడ్‌కు చెందిన మెగావత్ శ్రీకాంత్ కారులో వెళ్తుండగా ఆపి తనిఖీ చేశారు. అందులో క్వింటా గంజాయి ప్యాకెట్ల రూపంలో లభించింది. దీంతో కారు, గంజాయి, నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గంజాయి విలువ రూ.25 లక్షలు ఉంటుందని, ముగ్గురిపై కేసు నమోదు చేశామని సీఐ కరుణాకర్ తెలిపారు. తనిఖీల్లో కానిస్టేబుళ్లు ఘని, వీరన్న, ప్రసాద్, రాందాస్, భీమా పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న బాలిక మృతి

సుజాతనగర్: పాఠశాలకు వెళ్లడం ఇష్టం లేని ఓ బాలిక పురుగులమందు తాగగా.. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పాత అంజనాపురం గ్రామానికి చెందిన ఊకె రాణి, భద్రయ్య దంపతులకు ఇద్దరు కుమార్తెలు. చిన్నకుమార్తె ఊకె ఉదయశ్రీ (14) స్థానిక పాఠశాలలో 7వ తరగతి వరకు చదివింది. అనంతరం ఇంట్లోనే ఉంటోంది. గతేడాది జూన్‌లో బలవంతంగా చంద్రుగొండలోని కస్తూర్బా హాస్టల్‌లో 8వ తరగతిలో జాయిన్ చేశారు. చదువుకోవడం ఇష్టం లేక తనకు ఆరోగ్యం బాగా లేదని హాస్టల్ వార్డెన్‌తో ఈ నెల 2న ఇంటికి ఫోన్ చేయించగా ఆమెను ఇంటికి తీసుకొచ్చారు. రెండు రోజుల అనంతరం బాలిక ఆరోగ్యం బాగానే ఉందని గమనించిన ఆమె తల్లి పాఠశాలకు వెళ్లమని చెప్పి కూలీ పనులకు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేరని గమనించిన బాలిక అదేరోజు మధ్యాహ్నం పురుగులమందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సోమేశ్వర్ తెలిపారు.

గర్భిణి అయిన భార్యను చూసేందుకు వెళ్తూ..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మారేశ్ (ఫైల్)

టేకులపల్లి: గర్భం దాల్చిన తన భార్యను చూసేందుకు బయలుదేరాడు ఆ భర్త. మార్గమధ్యలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఆమెను చూడకుండానే కన్నుమూశాడు. ఈ ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. టేకులపల్లి ఎస్‌ఐ రమణారెడ్డి కథనం ప్రకారం.. ఇల్లెందు మండలం మొండితోగు పంచాయతీ కుమ్మరికుంట గ్రామానికి చెందిన ప్రవళికతో ములకలపల్లి మండలం మూకమామిడి గ్రామానికి చెందిన కొప్పుల మారేశ్(28)కు గతేడాది మే నెలలో వివాహమైంది. మారేశ్ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ప్రస్తుతం ప్రవళిక ఐదు నెలల గర్భిణి కావడంతో పుట్టింట్లో ఉంది. గురువారం పాల్వంచలో పని ఉంటే చూసుకుని అర్ధరాత్రి సుమారు 12.30 గంటల సమయంలో తాను వస్తున్న విషయం కూడా చెప్పకుండా భార్యను చూసేందుకు స్కూటీపై ఇల్లెందుకు బయలుదేరాడు. టేకులపల్లిలోని పెట్రోల్ బంక్ వద్దకు రాగానే ఇల్లెందు నుంచి వేగంగా దూసుకొచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మారేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. టేకులపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పట్టపగలే యువకుడి దారుణ హత్య

పాత గొడవల నేపథ్యంలో కర్రలతో కొట్టి చంపిన యువకులు



ప్రవీణ్ (ఫైల్)

బూర్గంపాడు: మండలంలోని మోతె పట్టీనగర్‌లో శుక్రవారం దారుణం చోటుచేసుకుంది. ఓ యువకుడిని పట్టపగలే నలుగురు యువకులు కర్రలతో అతి దారుణంగా కొట్టి చంపారు. ఈ ఉదంతంతో మోతె పట్టీనగర్‌లో భయాందోళనలు నెలకొన్నాయి. ఎస్‌ఐ రాజ్‌కుమార్ కథనం ప్రకారం.. సారపాకకు చెందిన గజ్జల ప్రవీణ్ అలియాస్ గజ (25)ను పాత కక్షల నేపథ్యంలో హతమార్చాలని మోతె గ్రామానికి చెందిన గుమ్మడి సతీశ్, అఖిల్, జేమ్స్, మౌలు లక్కీ ముందస్తు పథకం వేసుకున్నారు. శుక్రవారం మోతె పట్టీనగర్ బస్టాప్ వద్ద ప్రవీణ్ కనిపించగానే కర్రలతో విచక్షణారహితంగా కొట్టిచంపారు. ప్రవీణ్ మృతిచెందాడని నిర్ధారించుకున్న తరువాత నలుగురు నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. ఆ ప్రాంతమంతా రక్తసిక్తమైంది. సమాచారం అందుకున్న భద్రాచలం సీఐ నాగరాజురెడ్డి, బూర్గంపాడు ఎస్‌ఐ రాజ్‌కుమార్ అక్కడకు చేరుకుని ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టంకు తరలించారు. పారిపోయిన నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మృతుడు ప్రవీణ్ అనేక దొంగతనాలు, తగాదా కేసుల్లో నిందితుడిగా ఉండగా.. జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో కేసులున్నాయి. మృతుడికి భార్య బల్లు, బాబు ఉన్నారు. మృతుడి తల్లి గజ్జల అలివేలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మాయిలు అన్ని రంగాల్లో రాణించాలి



సెమినార్‌లో ప్రసంగిస్తున్న జ్యోతి

సూపర్‌బజార్(కొత్తగూడెం): అమ్మాయిలు అన్ని రంగాల్లో రాణించాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎం.జ్యోతి అన్నారు. సింగరేణి మహిళా కళాశాలలో శుక్రవారం విద్యాసంస్థల్లో 'లింగ వివక్షత'అనే అంశంపై ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గర్ల్స్ కన్వీనర్ భవ్య అధ్యక్షత వహించగా జ్యోతి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సైన్స్, ఇంజనీరింగ్, మెడిసిన్, టెక్నాలజీ రంగాల్లో అమ్మాయిలు మరింతగా రాణించాలని పేర్కొన్నారు. విద్యాసంస్థల్లో, ఇతర పనిప్రదేశాల్లో విద్యార్థినులు, మహిళలు ఎదుర్కొంటున్న లింగ వివక్షతకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. దేశంలో ఇంకా చాలా ప్రాంతాల్లో లింగ అసమానతలు చూపిస్తున్నారని, బాలికలు స్వేచ్ఛగా తిరగడానికి అనేక ఆంక్షలు విధిస్తుంటారని, పని, విద్య, వివాహం, సామాజిక బంధాలను ప్రభావితం చేసే నిర్ణయాలు తీసుకునే వారి సామర్థ్యంపై పరిమితులను సమాజం విధించిందని విమర్శించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శారద, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.లక్ష్మి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు భయ్యా అభిమన్యు, సందీప్, నాగకృష్ణ, జిల్లా నాయకులు రామ్‌చరణ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న దంతెవాడ పోలీసులు



గర్భిణిని జట్టీపై తీసుకొస్తున్న జవాన్లు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పోలీసులు మానవత్వాన్ని చాటుకున్నారు. విధి నిర్వహణలో అలసిపోయి ఉన్నప్పటికీ ఆపదలో ఉన్న గర్భిణిని ఆస్పత్రికి చేర్చారు. ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాకు చెందిన డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్ జిల్లాలోని మావోయిస్టు ప్రాబల్య ప్రాంత గ్రామాల్లో శుక్రవారం కూంబింగ్ చేపట్టాయి. ఈసందర్భంగా ఆదివాసీ గ్రామమైన లోహాగావ్‌లో నెలలు నిండిన గర్భిణి ప్రసవ వేదనతో ఇబ్బంది పడుతున్నట్లు తెలిసింది. దీంతో కూంబింగ్‌లో ఉన్న మహిళా జవాన్లు ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు కుటుంబీకులను ఒప్పించి జట్టీ కట్టి 10 కిలోమీటర్ల మేర దూరం మోసుకొచ్చారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన అంబులెన్సులో కిరండోల్ ఆస్పత్రికి తరలించారు.

సదరం స్లాట్ బుకింగ్ టైం పెంచాలి..

కారేపల్లిలో దివ్యాంగుల ఆందోళన



కారేపల్లిలో రాస్తారోకో చేస్తున్న దివ్యాంగులు

కారేపల్లి: సదరమ్ క్యాంపులు మండల కేంద్రాల్లో కాకుండా జిల్లా కేంద్రంలో మాత్రమే నిర్వహిస్తూ స్లాట్ బుకింగ్‌కు తక్కువ సమయం ఇస్తున్నారని ఆరోపిస్తూ కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో దివ్యాంగులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. సీపీఎం, న్యూడెమోక్రసీ నాయకులు మద్దతు తెలపడంతో అరగంట మేర ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు కొండెబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 13న ఖమ్మం ఆస్పత్రిలో నిర్వహించే సదరం క్యాంపుకు కారేపల్లి, కామేపల్లి మండలాల దివ్యాంగులను శుక్రవారం స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారన్నారు. అయితే, వివిధ ప్రాంతాల నుంచి కారేపల్లికి వచ్చేసరికి పది నిమిషాల్లోనే బుకింగ్ ముగియడంతో 50మందికి పైగా మిగిలిపోయారని తెలిపారు. ఈమేరకు బుకింగ్ సమయం పెంచడమే కాక మండల కేంద్రాల్లో కూడా క్యాంపు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కాగా, దివ్యాంగులు, నాయకుల ఆందోళనతో వాహనాలు భారీగా నిలిచిపోగా సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, ఎస్‌ఐ పి.రామారావు చేరుకుని నచ్చచెప్పారు. అయినా వారు వినకపోగా వాగ్వాదం జరిగింది. చివరకు వారు ఆందోళన విరమించగానాయకులు కె.నాగేశ్వరరావు, కె.నరేందర్, వై.ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అనుమతి లేకుండా రాస్తారోకో నిర్వహించిన సీపీఎం నాయకులు కె.నాగేశ్వరరావు, కె.నరేందర్, వై.ప్రకాశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు.

కుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు



చికిత్స పొందుతున్న అజయ్‌రాథోడ్

జూలూరుపాడు: మండలంలోని అన్నారుపాడు గ్రామంలో శుక్రవారం కుక్కలు ముగ్గురిపై దాడి చేసి గాయపర్చాయి. స్థానికుల కథనం ప్రకారం.. వేర్వేరు సమయాల్లో గ్రామంలో నడుచుకుంటూ వెళ్తున్న భూక్యా అజయ్ రాథోడ్, మాలోత్ భద్రు, బానోత్ వీరన్నపై రెండు కుక్కలు దాడిచేసి గాయపర్చాయి. వారిని కుటుంబ సభ్యులు జూలూరుపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మట్టి దందాపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న రాంబాబు

దమ్మపేట: మండలంలోని మందలపల్లి గ్రామ శివారులో అక్రమంగా మట్టి తొవ్వకాలు జరిగాయని అదే గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ నాయకుడు అడపా రాంబాబు తహసీల్దార్ ముజాహిద్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొద్దిరోజుల కిందట మందలపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి, మూడు జేసీబీలు, రెండు దోజర్లు, 27 ట్రాక్టర్ల ద్వారా ఎలాంటి అనుమతులు లేకుండా మందలపల్లి గ్రామ శివారులో గల ప్రభుత్వ భూమి నుంచి 475 ట్రక్కుల మట్టిని అక్రమంగా తరలించారని ఆరోపించారు. ఈ మట్టి దందాకు పాల్పడిన అందరిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నీటి మడుగులో పడి వ్యక్తి మృతి

దుమ్ముగూడెం: ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో ఓ వ్యక్తి నీటి మడుగులో పడి మృతిచెందిన ఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని అడవిరామారం గ్రామానికి చెందిన నూప రామకృష్ణ (36) గౌరారం గ్రామంలో ఓ కార్యక్రమానికి హాజరై తిరిగి వస్తున్నాడు. గౌరారం – కె.లక్ష్మీపురం గ్రామాల మధ్యకు రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పింది. దీంతో రామకృష్ణ నీటి మడుగులో పడి మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ గణేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి మెడలో ఆభరణాలు చోరీ

అశ్వాపురం: మండల కేంద్రంలో శుక్రవారం వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు, చెవు కమ్మలను గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. అశ్వాపురంలో ఆర్‌అండ్‌బీ కార్యాలయం సమీపంలో ఉన్న ఇంటికి మధ్యాహ్నం సమయంలో ఇద్దరు వ్యక్తులు వెళ్లారు. గ్యాస్ సబ్సిడీకి ఆధార్‌కార్డు వివరాలు కావాలని ఇంట్లో ఉన్న వృద్ధురాలిని అడిగారు. ఆధార్‌కార్డు కోసం ఇంట్లోకి వెళ్తున్న వృద్ధురాలి మెడలో ఇద్దరు వ్యక్తులు బంగారు గొలుసు, చెవుల కమ్మలు బలవంతంగా లాక్కొని పారిపోయారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సురేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బూర్గంపాడు: గోదావరి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. మూడు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా సమాచారం అందుకుని ఎస్‌ఐ రాజ్‌కుమార్ తమ సిబ్బందితో కలిసి పట్టుకుని, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేశామని ఎస్‌ఐ చెప్పారు.

అక్రమంగా తరలిస్తున్న ఫర్నీచర్..



అధికారులు పట్టుకున్న కలప వస్తువులు

పాల్వంచ: ట్రాలీ ఆటోలో అక్రమంగా తరలిస్తున్న కలప వస్తువులను అటవీ అధికారులు పట్టుకున్నారు. దుమ్ముగూడెం నుంచి ఖమ్మానికి ట్రాలీ ఆటోలో టేకు మంచం, కలప వస్తువులు తరలిస్తుండగా మండలంలోని నాగారం సమీపంలో డీఆర్‌ఓ జాహీదాబేగం, రేంజర్ అనిల్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. అనంతరం ఆటోతో పాటు వస్తువులను కలప డిపోకు తరలించి సీజ్ చేశారు. ఆటో ఓనర్ ఈశ్వరయ్య, డ్రైవర్ ఖాదర్‌పై కేసు నమోదు చేశారు.

పాపటపల్లి - జాన్‌పాడ్ రైల్వేలైన్ రద్దు చేయాలి



రైల్వే మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ రవిచంద్ర, తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం శివారు పాపటపల్లి నుంచి సూర్యాపేట జిల్లా జాన్‌పాడు వరకు ప్రతిపాదించిన రైల్వేలైన్‌ను రద్దు చేయాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌ను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కోరారు. ఈ మార్గంలో లైన్ నిర్మాణంతో రైతులు విలువైన పొలాలు నష్టపోతున్నందున ప్రత్యామ్నాయ మార్గాన్ని అన్వేషించాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శుక్రవారం ఢిల్లీలో ఎంపీ రవిచంద్ర ఆధ్వర్యాన రైతు ప్రతినిధులు వల్లూరి పట్టాభి, బానోత్ చంద్రావతి, గుర్రం రాము తదితరులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రతిపాదిత మార్గంలో దళిత, గిరిజన, పేద రైతులే ఎక్కువ ఉన్నందున భూములు కోల్పోతే జీవనోపాధి దెబ్బతింటుందని తెలిపారు. ఈమేరకు ప్రత్యామ్నాయ మార్గాలను కూడా వెల్లడించగా రైతులకు నష్టం జరగకుండా పరిశీలిస్తామని రైల్వే మంత్రి హామీ ఇచ్చారని ఎంపీ వెల్లడించారు.

గార్ల రైల్వేస్టేషన్‌లో సమస్యలపై..

మహబూబాబాద్ జిల్లా గార్ల రైల్వేస్టేషన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కేంద్ర మంత్రిని ఎంపీ రవిచంద్ర కోరారు. ప్రస్తుతం ఉన్న ప్లాట్‌ఫాంలను విస్తరించడమే కాక డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని, శాతవాహన, ఇంటర్ సిటీ రైళ్లకు హాల్టింగ్ సదుపాయం కల్పించాలని వినతిపత్రం అందజేశారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్యాట్రోల్ లీడర్ శిక్షణ

సింగరేణి(కొత్తగూడెం): భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నేతృత్వాన రాష్ట్రంలోని పలు జిల్లాల కేడెట్లకు ఐదు రోజుల ప్యాట్రోల్ లీడర్‌షిప్ శిక్షణ శిబిరం కొత్తగూడెంలో శుక్రవారం ప్రారంభమైంది. ఈ శిక్షణను కొత్తగూడెం చిల్డ్రన్స్ పార్క్‌లో సింగరేణి జీఎం పర్సనల్ కట్టా బసవయ్య ప్రారంభించి స్కౌట్స్ అండ్ గైడ్స్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దేశభక్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే కాక విపత్తుల సమయాన సేవలందించేలా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ కమిషనర్ బి.సుశీల్‌కుమార్‌తో పాటు వివిధ జిల్లాల కేడెట్లు పాల్గొన్నారు.

మేడారం జాతరకు 494 బస్సులు



డిపో మేనేజర్లు, సూపర్‌వైజర్లతో సమీక్షలో మాట్లాడుతున్న ఖమ్మం ఆర్‌ఎం వెంకన్న

ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రణాళిక

- గతంతో పోలిస్తే 50 శాతం రద్దీ ఉంటుందని అంచనా
- ఈసారి ఇల్లెందు నుంచి గుండాల మీదుగా సర్వీసులు
- 66 కి.మీ. మేర తగ్గనున్న దూరం



మేడారం జాతర పాయింట్లు, బస్సుల వివరాలు

డిపో	పాయింట్	సర్వీసులు
ఖమ్మం	ఖమ్మం	30
	ఇల్లెందు	124
సత్తుపల్లి	ఏటూరునాగారం	34
	వెంకటాపురం	11
	చర్ల	10
మణుగూరు	మణుగూరు	25
	మంగపేట	10
కొత్తగూడెం	కొత్తగూడెం	130
	టేకులపల్లి	25
మధిర	పాల్వంచ	45
భద్రాచలం	భద్రాచలం	50
మొత్తం		494

ఖమ్మంమామిళ్లగూడెం: తెలంగాణ కుంభమేళాగా పేరున్న ములుగు జిల్లా మేడారంలో జరిగే సమ్మక్క - సారలమ్మ జాతకు వెళ్లే భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా ఉండేలా ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోంది. ఖమ్మం రీజియన్‌లోని డిపోల ద్వారా ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు నిర్దేశిత పాయింట్ల నుంచి బస్సులు నడిపించనున్నారు. 2020లో జరిగిన మేడారం జాతర రద్దీని పరిగణనలోకి తీసుకుని.. ఈ ఏడాది జాతరకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేశారు.

'మహాలక్ష్మి'తో రద్దీ

2020 జాతరలో 1,33,141 మంది భక్తులు ఆర్టీసీ సర్వీసులు వినియోగించుకున్నారు. అయితే, ఈసారి మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఉండడంతో గతంతో పోలిస్తే 50 శాతం రద్దీ పెరుగుతుందని అధికారులు అంచనా వేశారు. ఈమేరకు ఖమ్మం రీజియన్‌లోని డిపోల పరిధిలో 11పాయింట్ల ద్వారా 494 బస్సులు నడిపించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో ఖమ్మం రీజియన్ నుంచి 130 బస్సులు వినియోగించనుండగా, నల్లగొండ రీజియన్ నుంచి 94, హైదరాబాద్ సిటీ రీజియన్ నుంచి 270 బస్సులు సమకూర్చుకుంటారు.

గుండాల మీదుగా..

గత మేడారం జాతరలో ఇల్లెందు నుంచి మేడారానికి మణుగూరు మీదుగా బస్సులు నడిపించారు. దీంతో 195 కి.మీ. మేర ప్రయాణించాల్సి వచ్చింది. ఇది దూరాభారం కావడంతో పాటు చార్జీలు కూడా పెరిగాయి. కానీ ఈసారి బస్సులను గుండాల మీదుగా నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఈ మార్గంలో 129 కి..మీ. దూరమే ఉండడంతో 66 కి.మీ. తగ్గి చార్జీలు కూడా తగ్గనున్నాయి.

ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోండి.

మేడారం జాతరకు ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నందున భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం రీజినల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న కోరారు. మేడారం జాతర ఏర్పాట్లపై రీజియన్ పరిధిలోని డిపోల మేనేజర్లు, ట్రాఫిక్ సూపర్‌వైజర్లతో ఖమ్మం కొత్తబస్టాండ్‌లో శుక్రవారం ఆయన సమీక్షించారు. ఉద్యోగులు సమన్వయంతో విధులు నిర్వర్తిస్తూ భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు. కాగా, పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు మినహా ఏసీ, సూపర్‌లగ్జరీ, డీలక్స్ బస్సుల సమయాల్లో ఎలాంటి మార్పు ఉండదని, ఆయా సర్వీసులు యథావిధిగా నడుస్తామనే అంశంపై అవగాహన కల్పించాలని చెప్పారు. కాగా, జాతర సమయాన పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులను కొన్ని రూట్లలో రద్దు చేసి, ఇంకొన్ని రూట్లలో ట్రిప్పులు తగ్గించాలని ఉంటుందని తెలిపారు. ఈనేపథ్యాన ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునేలా ప్రచారం చేయాలని సూచించారు.

మేడారం సర్వీసుల సమాచారం కోసం సంప్రదించాల్సిన నంబర్లు

డిపో	సెల్
ఖమ్మం కొత్త బస్టాండ్	99592 25979
ఖమ్మం పాత బస్టాండ్	99592 25965
సత్తుపల్లి	99592 25990
మణుగూరు	89853 61796
కొత్తగూడెం	99592 25982
మధిర	73829 25289
భద్రాచలం	99492 25987

నివేదికలు సమర్పించండి

- ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్
- జీఎస్టీ, ముష్టిగింజల సేకరణపై సమీక్ష



జీసీసీపై సమీక్షలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలంఅర్బన్: ఐటీడీఏ పరిధిలోని జీసీసీ ద్వారా నిర్వహిస్తున్న సొసైటీల్లో వస్తువుల ఆదాయపు పన్ను, జీఎస్టీ వివరాలతో పాటు ఏజెన్సీ ఏరియాలో ముష్టి గింజలు ఎక్కడెక్కడ సేకరిస్తున్నారో సర్వే చేసి ఈనెల 14లోపు నివేదికలు సమర్పించాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. భద్రాచలంలోని కార్యాలయంలో శుక్రవారం ఆయన జీసీసీ మేనేజర్లతో సమావేశమయ్యారు. జీసీసీ ద్వారా ఉమ్మడి జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలు, గురుకులాలకు నాణ్యమైన సామాగ్రిని మాత్రమే సరఫరా చేయాలని సూచించారు. అలాగే, ఆదివాసీ గిరిజనులు సేకరించే అటవీ ఫలాలను దళారులు దోచుకోకుండా జీసీసీకే విక్రయించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. అశ్వారావుపేట మండలం వినాయకపురం, పాల్వంచలో పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుకు అనుమతులు వచ్చినందున ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ఈసమావేశంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, అధికారులు భాస్కరన్, దావీద్, లక్ష్మోజీ, లక్ష్మణ్, నర్సింహారావు, ఖయ్యూం పాల్గొన్నారు.

విద్యార్థుల్లో స్ఫూర్తి నింపడం అభినందనీయం

గిరిజన విద్యార్థులు గిరిజన ప్రజలకు సేవలందించేలా చైతన్యం కల్పించడం అభినందనీయమని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ అన్నారు. మణుగూరు డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యాన అశ్వాపురం మండలం గొందిగూడెంలో ఈనెల 12 నుండి 18వ తేదీ వరకు 70 మంది వాలంటీర్లతో శిబిరం నిర్వహిస్తుండగా ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాస్ శుక్రవారం పీఓకు ఆహ్వానపత్రిక అందజేశారు. ఈసందర్భంగా పీఓ మాట్లాడుతూ గిరిజనులకు అవగాహన కల్పించడమే కాక సేవా కార్యక్రమాలు చేపట్టడం ద్వారా విద్యార్థులు మంచి పౌరులుగా ఎదుగుతారని తెలిపారు.

నేడు, రేపు ప్ర.ర.వే. మహాసభలు

- ముఖ్యాంశంగా 'స్త్రీలపై ట్రోలింగ్'
- అధ్యక్ష, కార్యదర్శులు అనిశెట్టి రజిత, మల్లీశ్వరి



మాట్లాడుతున్న అనిశెట్టి రజిత, పక్కన మల్లీశ్వరి, కాత్యాయనీ, రవిమారుత్ తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక(ప్ర.ర.వే) ఏడో మహాసభలను శని, ఆదివారం ఖమ్మంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు అనిశెట్టి రజిత, కేఎస్.మల్లీశ్వరి తెలిపారు. ఖమ్మంలోని హార్వెస్ట్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్ర.ర.వే. ఏర్పాటు చేసి 15 ఏళ్లు పూర్తికాగా, ప్రతీ రెండేళ్లకోసారి వేదిక మహాసభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈసారి 'స్త్రీలపై ట్రోలింగ్' అంశంగా ఖమ్మంలోని ఇల్లెందు క్రాస్ రోడ్‌లో ఉన్న వేదిక ఫంక్షన్ హాల్‌లో ఏడో మహాసభలు ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి 200మంది సాహితీవేత్తలు, సామాజిక ఉద్యమకారులు, జర్నలిస్టులు పాల్గొననుండగా, సమాజాన్ని కలవరపెడుతున్న 'ట్రోలింగ్' అంశంపై చర్చ జరుగుతుందని తెలిపారు. రాజకీయ పార్టీలు, కుల, మతతత్వ సంస్థలు, అప్రజాస్వామికులు భిన్నాభిప్రాయాన్ని అణిచివేయడానికి ట్రోలింగ్ ద్వారా లబ్ధి పొందుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, సమాజంలో ఏ చెడు ధోరణి తలెత్తినా ముందు బలయ్యేది స్త్రీలు, దళిత, మైనార్టీ తదితర పీడితులేనని తెలిపారు. ఈ సమస్యను సూక్ష్మ స్థాయిలో చర్చించి అర్థం చేసుకునేందుకు తమ వేదిక 'స్త్రీలపై ట్రోలింగ్'ను మహాసభల్లో ముఖ్యాంశంగా తీసుకుందని వెల్లడించారు. అనంతరం రవిమారుత్, కాత్యాయని విద్మహే, కొమరాజు రామలక్ష్మి, మువ్వా జయశ్రీ మాట్లాడుతూ మహాసభల్లో 'ట్రోల్' పుస్తక ఆవిష్కరణ ఉంటుందని, రెండోరోజు 'నారి సారించిన నవల' పుస్తకావిష్కరణతో పాటు పుస్తక సమీక్షలు, చర్చలు ఉంటాయని తెలిపారు. కాగా, సభల్లో సాహితీవేత్తలు, రచయితలు, సామాజిక ఉద్యమకారులు ఓల్గా, ఘంటా చక్రపాణి, జీఎస్.రామ్మోహన్, పీఓడబ్ల్యూ సంధ్య, విమలక్క, ఉదయభాను, ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, తులసి చందు, ఎన్.వేణుగోపాల్, ప్రొఫెసర్ కె.సునీతారాణి, కృష్ణకుమారి, కొండేపూడి నిర్మల, కొండవీటి సత్యవతి, అరుణ గోగులమండ తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఈ మేరకు సభలను విజయవంతం చేయాలని వారు కోరారు.

ఏజెన్సీ విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించడమే లక్ష్యం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం నియోజకవర్గంలోని ఏజెన్సీ ప్రాంత విద్యార్థుల్లో నైపుణ్యం, వ్యక్తిత్వాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఏటా ట్రైబల్ యూత్ ఎక్ఛేంజ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు భద్రాచలం 141 సీఆర్పీఎఫ్ బెటాలియన్ కమాండెంట్ రితేశ్‌ఠాకూర్ తెలిపారు. దేశవ్యాప్తంగా నిర్వహించే సదస్సులకు బెటాలియన్ ఆధ్వర్యాన విద్యార్థులను తీసుకెళ్తుండగా 2023–24 ఏడాదికి గాను 260 మంది విద్యార్థులు ఎనిమిది రాష్ట్రాల్లో జరిగిన సదస్సుల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు శుక్రవారం సీఆర్పీఎఫ్ క్యాంపులో ఏర్పాటు చేసిన సమావేశంలో కమాండెంట్ రితేశ్‌ఠాకూర్ మాట్లాడుతూ.. వివిధ రాష్ట్రాల సంస్కృతిపై అవగాహన కల్పించడమే కాక విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి, వ్యక్తిత్వ వికాసం కోసం ఈ ప్రోగ్రాంను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు కమల్‌వీర్ యాదవ్, ప్రీత, సింగ్రవెల్, సోంజిత్ భకట్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సీఆర్పీఎఫ్ అధికారులు

లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌దే విజయం

- మహబూబాబాద్ టికెట్‌కు అధిష్టానం గ్రీన్‌సిగ్నల్
- కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్



గుండాల : సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బలరాంనాయక్, పక్కన నాయకులు

టేకులపల్లి/మణుగూరు టౌన్/గుండాల: త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17సీట్లను కాంగ్రెస్ కైవసం చేసుకోవడం ఖాయమని కేంద్ర మాజీ మంత్రి, మహబూబాబాద్ మాజీ ఎంపీ పోరిక బలరాం నాయక్ పేర్కొన్నారు. టేకులపల్లి, మణుగూరు, గుండాలల్లో ఏర్పాటుచేసిన సమావేశాల్లో శుక్రవారం ఆయన మాట్లాడారు. మహబూబాబాద్ పార్లమెంట్ టికెట్ తనకు ఇచ్చేందుకు అధిష్టానం సుముఖంగా ఉందని.. ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. కాగా, అసెంబ్లీ ఎన్నికలకు ముందు తమ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో రెండు అమలవుతుండగా, మిగిలిన నాలుగింటికి అమలుకు కసరత్తు జరుగుతోందని తెలిపారు. కాగా, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయాన కేంద్రియ విద్యాలయాలు, మోడల్ స్కూళ్లతో పాటు పాటు 100 పడకల ఆస్పత్రులు, వేలాది గ్యాస్ కనెక్షన్లు, బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించానని గుర్తు చేశారు. ఇక అటవీ అధికారులు రైతులను ఇబ్బందులకు పెట్టకుండా.. వ్యవసాయ బోర్లు, కరెంటు లైన్లకు అనుమతి ఇవ్వాలని సూచించారు. కాగా, బలరాంనాయక్ మణుగూరుకు వచ్చే సమాచారం లేకపోవడంతో ప్రజాభవన్ ప్రధాన గదికి తాళం వేసి ఉండటంతో బయటే విలేకరులతో మాట్లాడి వెళ్లిపోయారు. ఈసమావేశాల్లో కాంగ్రెస్ నాయకులు భూక్యా దేవా నాయక్, రెడ్యానాయక్, గుండా నర్సింహారావు, రాసమల్ల నర్సయ్య, నర్సింగ్ లక్ష్మయ్య, బోడ సరిత, బోడ మంగీలాల్, గాదె కేశవరెడ్డి, ఆవుల సర్వేశ్వరరావు, బానోత్ లక్ష్మణ్, షేక్ ఆరిఫ్‌పాషా, సామా శ్రీనివాసరెడ్డి, వెలగపల్లి జాన్, మహబూబ్, శ్రీను, లక్ష్మణ్, మెరుగు రవీంద్రనాథ్, కొడెం ముత్యమాచారి, పాంబోయిన ముత్తయ్య, ఈసం పాపారావు, రాంనర్సయ్య, రమేష్, బొబ్బిలి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, టేకులపల్లిలో జరుగుతున్న కనకన్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీని బలరాంనాయక్ సందర్శించి కాసేపు బ్యాటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, నాయకులు బోడ మంగీలాల్‌నాయక్, మూడు గణేష్, కత్తుల అఖిల్, బోడ సరిత, రెడ్యానాయక్, నర్సింగ్ లక్ష్మయ్య, సంజయ్, పూన్యా, గుండా నరసింహారావు, ఈశ్వర్ పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లిస్తే వడ్డీ రాయితీ

- బ్యాంకు ఉద్యోగులకు 45 రోజుల సంక్రాంతి బోనస్
- డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం



మాట్లాడుతున్న చైర్మన్ నాగభూషణం, పక్కన సీఈఓ రెహమాన్ తదితరులు

ఖమ్మంవ్యవసాయం: సకాలంలో రుణాలు చెల్లించే వారికి కేంద్రప్రభుత్వం ప్రకటించిన వడ్డీ రాయితీ వర్తిస్తుందని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) చైర్మన్ కూరాకుల నాగభూషణం తెలిపారు. ఖమ్మంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో బ్యాంకు పురోగతి, రుణాల చెల్లింపు తదితర అంశాలపై ఆయన మాట్లాడారు. రుణాలు తీసుకున్న వారు నిర్దేశిత సమయంలో చెల్లిస్తే కేంద్ర ప్రభుత్వం ద్వారా మూడు శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుందని తెలిపారు. కాగా, రబీ సీజన్ పంట రుణాల పంపిణీ కొనసాగుతోందని.. సీజన్ లక్ష్యం రూ. 520 కోట్లకు గాను ఇప్పటి వరకు రూ.118.01 కోట్లు మాత్రమే రెన్యూవల్ అయ్యాయని పేర్కొన్నారు. మిగిలిన రూ. 401.99 కోట్లను రైతాంగం రెన్యూవల్ చేసుకొని వడ్డీ రాయితీ పొందాలని చైర్మన్ సూచించారు.

లాభాల బాటలో బ్యాంకు

బ్యాంకులో తమ పాలకవర్గం బాధ్యతలు చేపట్టాక ఆర్థికంగా బలోపేతం కావడమే కాక 2020 నాటికి నష్టాల్లో ఉన్న బ్యాంకును లాభాల బాట పట్టించామని చైర్మన్ నాగభూషణం తెలిపారు. ఆనాడు రూ.116.31 కోట్లుగా ఉన్న మూలధనాన్ని రూ. 144.52 కోట్లకు పెంచామని, డిపాజిట్లు రూ.994.03 కోట్ల నుంచి రూ.1,111.19 కోట్లకు పెరిగాయని పేర్కొన్నారు. అంతేకాకుండా పంట, విద్యారుణాలే కాక బంగారంపై రుణాలు భారీమొత్తంలో ఇచ్చామని తెలిపారు. ఇక లావాదేవీలు రూ.2,375.03 కోట్ల నుంచి రూ. 2,948.20 కోట్లకు పెరగగా... బ్యాంకు రూ.7.23 కోట్ల నష్టాల నుంచి రూ.15.78 కోట్ల లాభాల్లోకి చేరిందని వివరించారు. ఈ మేరకు ఉద్యోగులకు 45 రోజుల సంక్రాంతి పండుగ బోనస్ అందించనున్నట్లు చైర్మన్ తెలిపారు. అంతేకాకుండా సేవలను విస్తృతం చేసేందుకు ఖమ్మం రూరల్ మండలం కరుణగిరి, ఖమ్మం అర్బన్ మండలంలోని బల్లేపల్లి, నేలకొండపల్లి మండలం చెరువుమాదారం, వేంసూరు మండలం కందుకూరులో నూతన బ్రాంచ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో బ్యాంకు సీఈఓ అబీద్ ఉర్ రెహమాన్, డైరెక్టర్ పునుకొల్లు రాంబ్రహ్మం, డీజీఎం పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి టీపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) రాష్ట్ర ద్వితీయ విద్యా, వైజ్ఞానిక మహాసభలు ఖమ్మం వేదికగా జరగనున్నాయి. ఖమ్మం నయాబజార్ పాఠశాల మైదానంలో ఆది, సోమవారాల్లో ఈ సభలు జరగనుండగా, ఏర్పాట్లు పూర్తికావొచ్చాయని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి తెలిపారు.

హాజరుకానున్న మంత్రులు

ఈనెల 11న ఆదివారం 10గంటలకు పతాకావిష్కరణతో సభలు ప్రారంభమవుతాయి. సభల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసిరి సీతక్కతో పాటు వివిధ రంగాల ప్రముఖులు పాల్గొననున్నారు. వివధ అంశాలపై సెమినార్ల తర్వాత సాయంత్రం మహాప్రదర్శన, బహిరంగ సభ ఉంటాయి. ఇక సోమవారం 'అంతరాలు లేని విద్య, ప్రజల హక్కు – ప్రభుత్వ బాధ్యత' అంశంపై పలువురు ప్రసంగించనున్నారు.

జయప్రదం చేయండి

తిరుమలాయపాలెం: టీపీటీఎఫ్ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు ఏ.వీ.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. తిరుమలాయపాలెంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ హాజరయ్యే ఉపాధ్యాయులకు ప్రభుత్వం 12న ఆన్ డ్యూటీ సౌకర్యాన్ని కల్పించిందని తెలిపారు. టీపీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.వెంకటరాములు, డివీరభద్రంతో పాటు బి.వీరబాబు, బి.శివరావు, ప్రశాంత్, భద్రయ్య, సూక్యా, రవీందర్, శరత్, అరుణ, వాణిశ్రీ, సత్యనారాయణ, దేవ్‌సింగ్, వెంకట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

'భారతరత్న'ం.. సర్వత్రా హర్షం !

- పీవీకి అత్యున్నత అవార్డు ప్రకటించిన కేంద్రం
- జిల్లావ్యాప్తంగా హర్షాతిరేకాలు
- పలుమార్లు జిల్లాలో పర్యటించిన మాజీ ప్రధాని



ఖమ్మంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న పీవీ (కుడి చివర)

ఖమ్మంగాంధీచౌక్: తెలంగాణ బిడ్డ, మాజీ ప్రధాని పాములపర్తి వెంకటనరసింహారావు(పీ.వీ)కి కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్న ప్రకటించింది. పీవీ రాష్ట్ర ముఖ్యమంత్రి, దేశ ప్రధాని పదవులను అత్యంత సమర్థవంతంగా నిర్వర్తించి దేశ ప్రతిష్టతను ప్రపంచ వ్యాప్తంగా చాటారు. ఆర్థిక సంస్కరణల్లో కీలక పాత్ర పోషించిన బహుభాషా కోవిదుడు, రాజనీతిజ్ఞుడైన పీవీకి ఖమ్మం జిల్లాతోనూ అనుబంధం ఉంది. మంత్రిగా, ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు పలు మార్లు ఖమ్మం వచ్చారు. పీవీ బంధువులు పలువురు జిల్లాలో ఉండగా.. స్వాతంత్య్ర స్వర్ణోత్సవాల సందర్భంగా 1998లో ఖమ్మంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి శీలం సిద్ధారెడ్డితోపాటు గెల్లా కేశవరావు, పింగళి తిరుపతిరావు, చేకూరి కాశయ్య, వనం కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు. అలాగే, లక్ష్మీకాంతమ్మ ఖమ్మం ఎంపీగా పోటీ చేసినప్పుడు పీవీ ప్రచారం చేశారు. జిల్లాతో అనుబంధం కలిగిన పీవీ నర్సింహారావుకు ప్రభుత్వం భారతరత్న ప్రకటించడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పీవీకి భారతరత్న ఇవ్వడం హర్షణీయం

ఖమ్మంమయూరిసెంటర్/సత్తుపల్లి/అశ్వారావుపేట రూరల్: దేశ ఆర్థిక రంగ పితామహుడు, తెలంగాణ బిడ్డ మాజీ ప్రధాని పీవీ.నరసింహారావుకు భారతప్రభుత్వం దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్న ప్రకటించడంపై మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు, సత్తుపల్లి, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు వేర్వేరు ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తొలి తెలుగు వ్యక్తి పీవీ అని, సంస్కరణలు తీసుకొచ్చి దేశాన్ని ఆర్థిక ఇబ్బందుల నుండి గట్టెక్కించారని తెలిపారు. కాగా, పీవీ సేవలకు గుర్తింపుగా భారతరత్న ఇవ్వాలని బీఆర్ఎస్ పలుమార్లు కేంద్రాన్ని కోరిన విషయాన్ని వారు గుర్తుచేశారు.

ఆపత్కాలంలో ఆదుకున్న మహర్షి



దేశం ఆపత్కాలంలో ఉన్న సమయాన తనదైన శైలితో ఆదుకున్న మహర్షి పీవీ.నర్సింహారావు. దేశం ఆర్థికంగా బలోపేతమయ్యేలా పునాదులు వేశారు. బహు భాషా కోవిదుడైన పీవీ.నర్సింహారావుకు కేంద్రప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించటం ఆనందంగా ఉంది.

– డాక్టర్ వనం కృష్ణవేణి, మాజీ కౌన్సిలర్

ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు



ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని బలోపేతం చేసిన పీవీ భారతరత్న అవార్డుకు అన్ని రకాలుగా అర్హుడు. బహుబాషా కోవిదుడిగా, రాజనీతిజ్ఞుడిగా, పరిపాలనాదక్షుడిగా ఆయన పేరు సాధించారు. కేంద్రప్రభుత్వం తెలంగాణ బిడ్డకు భారతరత్న ప్రకటించడం హర్షణీయం.

– మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు, ఖమ్మం

దేశం గర్వించదగిన నేత



దేశం గర్వించదగిన నేత పీవీ.నర్సింహారావు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ప్రధానిగా పగ్గాలు చేపట్టి అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. 1973లో రాజ్యాంగ సవరణల ద్వారా వెనకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించిన పీవీకి భారతరత్న రావడం అందరికీ గర్వకారణం.

– ఈశ్వరప్రగఢ హరిబాబు, హైకోర్టు న్యాయవాది, ఖమ్మం

తెలుగు ప్రజలకు గర్వకారణం



మాజీ ప్రధాని పీవీకి భారతరత్న అవార్డు ప్రకటించటం తెలుగు ప్రజలంతా గర్వించదగిన అంశం. దేశంలోనే తెలుగు రాష్ట్రాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన మహామనిషి పీవీ.బహు భాషా కోవిదుడైన ఆయన ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా పదవులకు వన్నె తెచ్చారు.

– సురావజ్ఝల వాసుశర్మ, అధ్యక్షుడు, జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం

అంతర్రాష్ట్ర దొంగలు అరెస్ట్

మేడారం జాతరలో చోరీలకు వెళ్తూ పట్టుబడిన నిందితులు

ఖమ్మంక్రైం: మేడారం జాతర రద్దీని ఆసరాగా చేసుకోవచ్చని చోరీలు చేయొచ్చనే ఆలోచనతో వెళ్తున్న ముగ్గురు అంతర్రాష్ట్ర జేబు దొంగలు ఖమ్మంలో శుక్రవారం పోలీసులకు చిక్కారు. ఈమేరకు వివరాలను నగర ఏసీపీ హరికృష్ణ శుక్రవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు చెందిన ఏడుగురు సభ్యుల ముఠా ములుగు జిల్లా మేడారంలో జరిగే జాతరలో రద్దీ ఉంటుందని.. సులువుగా చోరీలు చేయొచ్చనే భావనతో బయలుదేరారు. ఏపీ నుంచి రైలులో ఖమ్మం వచ్చిన వీరు అనుమానస్పదంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా విషయం బయటపడింది. ఈమేరకు విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన రావుల పార్వతి, రావుల రమణ, ఎల్.కోట మండలం రంగాపురానికి చెందిన దాసు యేసుమణి, దాసు యాకుబ్, ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం మాధవరానికి చెందిన మల్లాది సిద్దరావు, కొమ్ము రాము, ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంనకు చెందిన బూరుగు సత్యనారయణను ఖమ్మం వన్ టౌన్, త్రీ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారని ఏసీపీ తెలిపారు. కాగా, నిందితులపై గతంలో 50 వరకు కేసులు ఉన్నాయని ఏసీపీ హరికృష్ణ వెల్లడించారు.